క్లుప్తంగా

రాజన్న ప్రసాదం అందజేత



వేములవాడ: రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయుల చంద్ర శేఖర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఎస్. లక్ష్మణరావు వేములవాడ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

మంత్రి 'పొన్నం'ను కలిసిన నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్ల పద్మశాలీ సంఘం నాయకులు, వస్త్రోత్పత్తిదారులు కరీంనగర్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. పద్మశాలీ సంఘం భవనం, వస్త్రోత్పత్తిదారుల సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మహిళా అధ్యక్షురా లు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, కోశాధికారి కోడం శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు కాముని నలినీకాంత్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్, యారన్ అసోసియేషన్ అధ్యక్షులు పిస్క మధు, కొక్కుల వెంకటేశం, దూడం శ్రీనివాస్, కోడం అమర్, బూట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు తీసుకున్న ఇల్లంతకుంట ఎస్సై


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై రాజుగౌడ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల ఎస్సైగా సోమవారం రాజుగౌడ్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతల రక్షణ కు కృషిచే స్తానన్నారు. ప్రజలు సమస్యలపై నే రుగా పోలీస్‌స్టేషన్‌లోఫిర్యాదు చేయాలన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త నేవూరి వెంకట్‌రెడ్డి సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. రాజీనామ పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు అందించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..పార్టీలో అంకితభావంతో పనిచేసినా తగిన గుర్తింపు లేదన్నారు. కాగా వెంకట్‌రెడ్డి తొందర్లనే కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆయన సన్నిహితులు తెలుపుతున్నారు.

దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

బోయినపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్‌లో గృహజ్యోతి దరఖాస్తులు స్వీకరించారు. విద్యుత్ బిల్లుల రీడింగ్ తదితర జిరాక్సు ప్రతులు అందించి పలువురు వివరాలు నమోదు చేయించుకున్నారు. కొందరికి 200 యూనిట్ల లోపు మీటర్ రీడింగ్ ఉన్నా విద్యుత్ బిల్లులో జీరో బిల్‌రాని వారు మళ్లీ దరఖాస్తులు అందజేశారు. కొందరు సెస్ కార్యాలయంలో సెస్ ఏఈజీ ప్రశాంత్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో పెద్దఎత్తున క్యూలో నిల్చుండి వివరాలు నమోదు చేయించుకున్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలి



కోనరావుపేట: మండలం నిమ్మపల్లి, కోనరావుపేట గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు సీపీఎం జిల్లా నాయకురాలు జవ్వాజి విమల చల్లని తాగునీటి అందజేశారు. ఉపాధి పనులుచేస్తున్న కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేస్తున్న స్థలాల్లో కూలీలకు సరైన వసతులు కల్పించడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం రూ. 600 వేతనాన్ని అందించాలన్నారు. గౌరవ్వ, అంజవ్వ, శారద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు రూ.600 కూలీ చెల్లించాలని మండల సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్ కోరారు. మండలంలోని రామన్నపేటలో సోమవారం ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనులు చేసే ప్రదేశంలో కూలీలకు తాగునీటి వసతి, టెంట్, వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. పెరుగుతున్న ధలకు అనుగుణంగా కూలీలకు కూలీ పెంచాలని కోరారు. కూలీలు కనుకయ్య, రవి, కన్నం మల్లేశం, సత్తిరెడ్డి, మహిళా కూలీలు ఉన్నారు.

ఏళ్లుగా అసంపూర్తిగానే..


ముస్తాబాద్‌లో అసంపూర్తిగా నిర్మించిన మార్కండేయ భవన్


పూర్తికాని అంగన్‌వాడీ భవనం

- మండలంలో నిధులు లేమితో నిలిచిన పలు భవనాలు..
- పట్టించుకోని అధికారులు
- కొత్త సర్కారుపైనే ఆశలు
- నిధులు మంజూరు చేసి అందుబాటులోకి తేవాలని డిమాండ్

ముస్తాబాద్: అభివృద్ధి పనుల అంచనాల మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. క్షేత్రస్థాయిలో మాత్రం నిధులు సరిపోవడం లేదని పనులను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. ఏళ్లు గడిచినా పనులు పూర్తికాకపోవడం, ఇటు అదనపు పనులకు నిధులు రాక అసంపూర్తిగా భవనాలు నిలుస్తున్నాయి. మండలంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు సరిపోక అలాగే వదిలేశారు. పనుల ప్రతిపాదనల సమయంలోనే ఇంజినీరింగ్ అధికారులు అంచనాలను సరిగా రూపొందించినా నిధులు సరిపోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో పూర్తికాని భవనాలివే..

- మండలకేంద్రంలో పదేళ్ల క్రితం చేపట్టిన మార్కండేయ భవన నిర్మాణం ఇప్పటికి పూర్తికాలేదు. మాజీ మంత్రి కేటీఆర్ పలు దఫాల్లో నిధులు మంజూరు చేసినా ఫస్ట్‌ఫ్లోర్ పనులు పూర్తి కా లేదు. ముదిరాజ్ సంఘం భవనాలు రెండు నిధులు సరిపోవడం లేదని మధ్యలోనే నిలిపివేశారు.
- ముస్తాబాద్ మండల వనరుల కేంద్రంలో అంగన్‌వాడీ భవనం నాలుగేళ్లుగా ముందుకుసాగడం లేదు. కేసీఆర్ కాలనీలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం పనులు చివరిదశకు చేరినా దానిని అప్పగించడం లేదు.
- పోతుగల్‌లో పంచాయతీ భవనాన్ని మాజీ సర్పంచ్ గౌతంరావు చేపట్టారు. భవనం నిర్మించినా నిధులు రాక పనులు నిలిచిపోయాయి. జెడ్పీ స్కూల్‌లో చేపట్టిన మూత్ర విసర్జన కోసం చేపట్టిన నిర్మాణ పనులు బెస్‌మెంట్ లెవల్‌లోనే నిలిచాయి.
- గూడెంలో రైతువేదిక పనులకు నిధులు సరిపోవడం లేదని కాంట్రాక్టర్ పనులు వదిలేశారు. రెండు గ్రామాల క్లస్టర్‌కు మరోసారి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. యాదవ, గౌడ సంఘం భవనాలు స్లాబ్ లెవల్‌లోనే ఉన్నాయి.
- ఆవునూర్‌లో ఏడాది క్రితం ప్రారంభించిన పశు వైద్యశాల స్లాబ్ వరకు సెంట్రింగ్ చేసి కాంట్రాక్టర్ వదిలేశారు.
- ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు.
- బందనకల్‌లో మహిళా భవనం పనులను ప్రారంభించలేదు. జెడ్పీస్కూల్‌లో అదనపు గదుల పనులు చివరి దశలో ఉండగా చిన్న చిన్న పనుల కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు.
- బందనకల్, బంజేరుపల్లి గ్రామాల మధ్య ఒర్రెపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. రూ.35 లక్షలు మంజూరు చేసినా పనులు మొదలుకాలేదు. పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టినా మంజూరు కాలేదు.
- బుడగజంగాల భవనం స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు.
- చిప్పలపల్లి నుంచి బండలింగంపల్లి రోడ్డులో కిలోమీటర్ పనులను విస్తరించలేదు. చిప్పలపల్లిలో ప్రగతి భవనం టెండర్ పూర్తైనా పనులు ప్రారంభం కాలేదు. మహిళా భవనానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు.
- చీకోడులో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి కాలేదు. పెయిటింగ్, ఎలక్ట్రిసిటీ పూర్తి చేయాల్సి ఉంది.

పలుసార్లు వినతులు..

మండలంలో సగంలో నిలిచిపోయిన పనులు పూర్తిచేయాలని ఆయాగ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన మిగులు పనులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు ఇప్పటికే పలుసార్లు విన్నవించారు. సీడీఎఫ్, ఈజీఎస్ ద్వారానైన పెండింగ్ పనులు పూర్తి చేస్తే ప్రజలకు వసతులు కల్పించవచ్చు. ఈమేరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఇప్పటికే రూ. 2కోట్లు ఆయా పనులకు కేటాయించారు. అయితే పెండింగ్ పనులకు నిధులు ఇస్తే ప్రజలకు అవి అందుబాటులోకి వస్తాయని ఆయా సామాజిక వర్గాలతోపాటు, పలువురు పేర్కొంటున్నారు.

నిధులు మంజూరు చేయాలి



మార్కండేయ భవన్ మొదటి అంతస్తు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. స్లాబ్ పూర్తయింది. రూ.15లక్షలు మంజూరు చేస్తే మండల ప్రజలకు ఏసీ ఫంక్షన్‌హాల్ అందుబాటులోకి వస్తుంది. పట్టణ నడిబొడ్డున పేద, మధ్య తరగతి ప్రజలకు మార్కండేయ భవన్ సేవలు అందిస్తుంది.
– భరత్, ముస్తాబాద్

సగంలోనే నిలిచాయి



కోట్లాది రూపాయలతో చేపట్టిన ఎన్నో అభివృద్ధి పనులు సగంలో నిలిచాయి. పాలకులు పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి. రూ. రెండుకోట్లు కేటాయిస్తే చాలాపనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించవచ్చు.
– ఎద్దండి నర్సింహరెడ్డి, ముస్తాబాద్

నిధులు సరిపోకనే..



మండలంలో ఎన్నో పనులు అసంపూర్తిగా నిలిచాయి. పనులు ఆలస్యంగా మొదలుకావడంతో నిధులు సరిపోవడం లేదు. పెరిగిన స్టీల్, ఇసుక, ఇతర వస్తువులకు అనుగుణంగా పనులు చేయిస్తున్నాం. మిగులు పనులకు ప్రతిపాదనలు తయారుచేశాం.
– ఇనాయతుల్లా, ఏఈ పీఆర్, ముస్తాబాద్

తాగు, సాగునీటి ఇబ్బందులు తీర్చాలి


మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: వేసవిలో తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యాసంగి పంటపొలాలు ఎండిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కాలనీలో అక్రమకట్టడాలను తొలగించాలని, పట్టాలు లేనివారి నిర్మాణాలను తీసివేయాలని ఎంపీటీసీ శ్రీనివాస్ కోరారు. విద్యార్థి సంఘాలు మధ్యాహ్న భోజనాలపై ఆందోళనలు చేస్తున్నారని, నాణ్యమైన భోజనం అందించేలా చూస్తున్నామని ఎంఈవో బన్నాజీ తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని కోరారు. ప్రత్యేకాధికారులు ప్రతి పనిని రికార్డు చేసి, బిల్లులు విడుదల చేయాలని ఎంపీడీవో భాస్కర్‌శర్మ కోరారు. మండలకేంద్రంలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుని, పంచాయతీలకు సంబంధించిన స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీపీ సూచించారు. గృహజ్యోతి పథకం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జీరో బిల్లులకు అవసరమైన సమాచారం ఇవ్వాలన్నారు. మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని ఎంపీపీ తెలిపారు. రానున్న రోజుల్లో ఎగువమానేరు, మల్లన్నసాగర్ ద్వారా పంటలకు నీరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీవో భాస్కర్‌శర్మ, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'కదనభేరి'కి తరలిరావాలి


వేములవాడ : మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


ముస్తాబాద్ : మాట్లాడుతున్న సురేందర్ రావు

వేములవాడ: నేడు కరీంనగర్‌లో నిర్వహించే కదనభేరి సభకు వేలసంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పిలుపునిచ్చారు. సోమవారం వేములవాడలోని ఆయన నివాసంలో మాట్లాడారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్వహించే సభకు పెద్దసంఖ్యలో తరలి రావాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి, అన్ని మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కరీంనగర్ కదనభేరి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ మండల, పట్టణాధ్యక్షులు సురేందర్‌రావు, నర్సింహారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలుచేయడం లేదని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. యువజనశాఖ అధ్యక్షుడు స్వామి, మాజీ సర్పంచ్ ఎల్లం, నర్సింలు, మనోహర్, అన్వర్ తదితరులున్నారు.

మాజీ సర్పంచులకు పెన్షన్ ఇవ్వాలి


మాట్లాడుతున్న గాంధీరావు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రంలో మాజీ ఎమ్మెల్యేలకు మాదిరిగా మాజీ సర్పంచులకు సైతం పింఛన్ ఇవ్వాలని రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం అడ్వయిజర్ కొండూరి గాంధీరావు కోరారు. ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచులు ఆర్థికంగా నష్టపోయి ఉన్నారన్నారు. ఐదేళ్ల ప్రజలకు సేవ చేసిన మాజీ సర్పంచులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకోవాలని కోరారు. నాయకులు బొడ్డు దేవయ్య, మిరియాల్‌కార్ శ్రీనివాస్, బుర్ర మల్లేశంగౌడ్, రాజిరెడ్డి, ఎల్లారెడ్డి, బుర్ర మల్లేశంగౌడ్, నారాయణ పాల్గొన్నారు,

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ మాధవి


వేములవాడ: పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. వేములవాడ పట్టణంలోని 21వ వార్డులో కౌన్సిలర్ నరాల శేఖర్‌తో కలిసి ఆమె సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం నిధులనుంచి రూ. 12 లక్షల నిధుల్లోంచి 21 వార్డులో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణం మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు దశరథం, తూపుకారి అచ్చయ్య, తూపుకారి శ్రీనివాస్, వొడ్యాల వేణు, బుస్స బుచ్చిబాబు, దురిశెటి నాగరాజు, పొలాస శ్రీనివాస్, రవీందర్, మామిండ్ల అంజయ్య, వార్డు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చందుర్తి : మండలంలోని మల్యాల, లింగంపేట గ్రామాల్లో పలువురు మృతిచెందగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. లింగంపేటలో శ్రీరాములు నారాయణ, బీరెల్లి గంగమ్మ, మల్యాలలో అనపర్తి శంకరయ్య మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి, వైస్ ఎంపీపీ రాజయ్య, తదితరులున్నారు.

రుద్రంగి(వేములవాడ): మానాలలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూము జలపతి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు, తదితరులున్నారు.

జనంలోకి జింక



గంభీరావుపేట (సిరిసిల్ల): వనం వీడిన జింక జనంలోకి చేరింది. కుక్కలు వెంటబడి తరుమడంతో మండలకేంద్రంలోని దోసలగూడెం కాలనీలోని ఓ ఇంట్లోకి దూరింది. అది గమనించిన యువకులు కుక్కలను వెళ్లగొట్టారు. జింకను రక్షించేందుకు ఇంటిగేటు పెట్టి అధికారులకు సమాచారం అందించారు. ఎస్సై రామ్మోహన్, ఫారెస్ట్ అధికారి స్వప్న అక్కడికి చేరుకొని గాయాలైన జింకకు ప్రాథమిక చికిత్స అందించి కరీంనగర్‌లోని జింకల పార్కుకు తరలించారు.

13న డబుల్ బెడ్‌రూంల గృహప్రవేశం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఈనెల 13న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేస్తారని ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే 40 మంది లబ్ధిదారులను డ్రాద్వారా ఎంపికచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జావేద్ అహ్మద్, ఆర్ఐ షఫీ, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య యాదవ్, వీఆర్వో సింగారెడ్డి, డైరెక్టర్ గన్నారం వసంతనర్సయ్య, పసువుల బాలరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

గంభీరావుపేట: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధి చేతగాని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. పట్టణ శాఖ అధ్యక్షుడు రాజుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాం ట చంద్రారెడ్డి, మండల యూత్ విభాగం అధ్యక్షుడు గంగిస్వామి, నర్సింలు, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• 'ఉపాధి' పనుల పరిశీలన

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్ల, బాబాయి చెరువు తండాలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారి నవీన్‌కుమార్ పరిశీలించారు. ఇన్‌చార్జి ఏపీవో శ్రీహరి, టీఏ నాగరాజు, అనిత, ఫీల్డ్ అసిస్టెంట్స్, తదితరులున్నారు.

• ముగ్గురిపై కేసు

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన రాస్తారోకో ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైనట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకుని ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించిన సీఐటీయూ నాయకులు కూరపాటి రమేశ్, మూషం రమేశ్, కోడం రమణలపై కేసునమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

• కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్యసంఘం అధ్యక్షుడిగా మామిడిపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మండల శాఖ అధ్యక్షుడు సంకోజి సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా బూరుగుపల్లి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా బూరుగుపల్లి కిషన్, కోశాధికారిగా బూరుగుపల్లి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కే. రాజు, ఎం. ప్రవీణ్‌కుమార్, బి.రమణాచారి, నర్సింహాచారి, తిరుపతి, అభిలాష్, ఆదిత్య ఎన్నికయ్యారు.

• దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసేందుకు అర్హులైన ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి దూస రఘుపతి కోరారు. అన్ని జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో కలిపి మొత్తం 101 కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఇన్‌స్టాలేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో కంప్యూటర్ విలువ రూ.20 వేలు ఉంటుందని, ఆసక్తిగల ఏజెన్సీలు ఈనెల 12నుంచి 14న సాయంత్రం 5 గంటల్లోపు మండల వనరుల కేంద్రంలో టెండర్లు అందించాలన్నారు.

• అభివృద్ధి పనులకు భూమిపూజ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పద్మశాలీ శ్మశానవాటికలో ప్రహరీ, విద్యుత్ మోటార్ బోరుబావి నిర్మాణాలకు ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు శంకుస్థాపన చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల కింద ప్రభుత్వం రూ.48లక్షలు మంజూరు చేయగా భూమిపూజ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు బాబు, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాములు, బుచ్చాగౌడ్, ఆంజనేయులు, రఫీక్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

తంగళ్లపల్లి: మండలంలోని పలుగ్రామాల్లో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో పలు అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి భూమిపూజ చేశారు. అంకుషాపూర్‌లో ఓపెన్ జిమ్, చిన్నలింగాపూర్ అంగన్‌వాడీ ప్రహరీ, చిన్నలింగాపూర్‌లో డ్రైనేజీ నిర్మాణం, వేణుగోపాల్‌పూర్‌లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఎంపీటీసీ రాము, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు రాజశేఖర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు హారిక రెడ్డి, అంజయ్య, లక్ష్మణ్, రాజేశం, మాజీ సర్పంచ్ ఎల్లవ్వ నాంపెల్లి, క్యారం నాగరాజు, కనకయ్య, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, సర్వయ్య, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, భూమయ్య పాల్గొన్నారు. .

• అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం

ముస్తాబాద్: మండలకేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి సురేశ్ హెచ్చరించారు. మండలకేంద్రంలో జరుగుతున్న పలు నిర్మాణ పనులను సోమవారం ప్రత్యేకాధికారి పరిశీలించారు. అనుమతులు పొందిన ప్రకారమే పనులు చేయాలని స్పష్టంచేశారు. ఎవరైనా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామన్నారు. పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా సహకరిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంట అశోక్ అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్ చేసిన అభివృద్ధి బీఆర్ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్‌ను ప్రజలు భారీమెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు పర్శాగౌడ్, రమేశ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

డీఈని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్‌నిర్మాణం పనులు త్వరగా చేపట్టాలని కోరుతూ సోమవారం ఆలయ కమిటీ సభ్యులు దేవాదాయశాఖ డీఈ రాజేశ్‌ను కలిశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో చేపట్టిన తీర్మానపత్రం అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ కిషన్, వైస్‌చైర్మన్ ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, కోశాధికారి రవీందర్, శ్రీలక్ష్మీకేశవ పేరుమాండ్ల స్వామి ఆలయ చైర్మన్ పారిపెల్లి రాంరెడ్డి పాల్గొన్నారు.

మహిళల రక్షణే లక్ష్యం


మాట్లాడుతున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మహిళలు, యువతులు ఆకతాయిల వేధింపులకు గురైతే నిర్భయంగా షీటీమ్ సిబ్బందిని సంప్రదించాలని షీటీమ్ పోలీస్ అధికారులు తెలిపారు. మండలంలోని బొప్పాపూర్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళలు సోషల్‌మీడియాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత విషయాలు పోస్టు చేయొద్దని సూచించారు. ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే 87126 56425 లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. హెచ్‌ఎం మధుమాలతి, టీచర్లు మాలతి, రేవతి పాల్గొన్నారు.





వైభవంగా పోచమ్మ బోనాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి సిద్దోగ వేడుకల్లో భాగంగా సోమవారం పోచమ్మ బోనాలు తీశారు. గౌడకులస్తులు ఇంటికొక బోనం చొప్పున పోచమ్మ ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దారి పొడవునా శివసత్తుల శిగాలు, బైండ్ల వారి గాంధ్రింపులు ఆకర్షణగా నిలిచాయి. గౌడ సంఘం ప్రతినిధులు బొల్గం వీరాగౌడ్, బొల్గం రాధాకృష్ణ, బొల్గం గోవర్ధన్‌గౌడ్, లింగాల యాదగిరి, బొల్గం శ్రీనివాస్‌గౌడ్, బొల్గం దిలీప్‌గౌడ్, పాముల స్వామిగౌడ్, పాముల అంజాగౌడ్, మెరుగు గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.